# నువ్వే నా ప్రపంచం

- రాయవరపు రత్నాకర్ రావు , Hampshire, UK

"అబ్బ! ఈ హిందీ సినిమా హీరోలు ఏం చేస్తారండీ వయస్సు కనపడకుండా ఉండటానికి. ఎన్నాళ్ళనుంచి చూసినా ఇంకా అలా కాలేజీ కుర్రాళ్ళలాగే కనబడతారు" టీవీ కేసి కన్నార్పకుండా చూస్తూ అంది పద్మ.

"ఎంత అందమున్నా ఏం లాభమే, కెమేరా ముందు నటించడం రావాలి కదా" టీవీ కేసి అస్సలు చూడనట్లుగా నటిస్తూ అన్నాడు ప్రభాకర్.

"సరే వాళ్ళగురించే ఎందుకులెండి, మీరుమాత్రం ఎప్పుడూ మిసమిసలాడుతూ ఉండరూ! మన పెళ్ళయ్యి ఎనిమిదేళ్ళు అవుతున్నా రోజురోజుకూ మీ అందం పెరుగుతోంది కానీ తగ్గడంలేదు" అంది పద్మ.

"అందుకే చెప్పేది, ఆ వెధవ బ్యూటీ సోపులు వదిలేసి నాలా ఆయుర్వేదం సబ్బులు వాడమని, వింటేగా...అయినా ఎందుకొచ్చిన హిందీ సినిమాలే, శుభ్రంగా తెలుగు సినిమాలు చూడచ్చు కదా" అన్నాడు ప్రభాకర్.

"అబ్బా ఉండండీ, వీళ్ళకి ఒక్కక్క సినిమాకి ఎంతిస్తారండీ, కోటి పైనే తీసుకుంటారేమో కదండీ" అంది పద్మ.

"ఎంత డబ్బు వున్నా వాళ్ళకి మనశ్శాంతి ఉండదే అదే నా సంగతి చూడు, సుఖాలు కొనలేకపోయినా ఎంత ప్రశాంతంగా బ్రతికేస్తున్నానో" అన్నాడు ప్రభాకర్.

"ఆ...అయినా ఆ సినిమా వాళ్ళు ఎంత సంపాదించినా, కనీసం ఆ సంపాదించింది లెక్క పెట్టడం వస్తుందా. అదే మిమ్మల్ని చూడండి మన జిల్లాలో ఉన్న మీ కంపెనీ షోరూముల పద్దులన్నీ నిద్రలో అడిగినా చటుక్కున చెప్పెయ్యగలరు. అదీ గొప్పంటే" అంది పద్మ.

"సంతోషించాములే. ఇక నస ఆపి భోజనం వడ్డించు. తిని పడుకుంటాను" అన్నాడు ప్రభాకర్.

"ఏమండీ సరదాగా కొంచెం సేపు కబుర్లు చెప్పచ్చు కదా, బంటిగాడు పడుకున్నాడు కూడా" అంది పద్మ.

"సర్లే నీతో కబుర్లు చెప్తూ కూర్చోవాలంటే నాకు కుదరదు. రేపు తొందరగా ఆఫీసుకు వెళ్ళాలి మా చీఫ్ అక్కౌటెంట్ వస్తున్నాడు" అంటూ లేచాడు ప్రభాకర్.

ఆదివారం మధ్యాన్నం హాలులో సోఫాపై కునికిపాట్లు పడుతున్నాడు ప్రభాకర్.

"నాన్నా, నాన్నా... గోల్ఫ్ ఆటంటే ఏంటి నాన్నా" అప్పుడే స్నేహితులతో ఆట ముగించి ఇంటికి వచ్చాడు బంటి.

"మళ్ళీ నీకు ఎవరు ఏమి కొత్త వెర్రి ఎక్కించారురా..." అన్నాడు ప్రభాకర్.

"అదికాదు నాన్నా, ఆ ట్వింకిల్ ఫ్లాట్స్‌లో ఉండే ప్రకాష్‌గాడు చెప్పాడు. వాళ్ళ నాన్న కంపెనీ గోల్ఫ్ చాంపియనుట" అన్నాడు బంటి. "ప్రతివాడూ గోల్ఫ్ చాంపియను అయిపోతే టైగర్ వుడ్స్ లాంటివాళ్ళు ఆత్మహత్యలు చేసుకోవాలి. గోల్ఫ్ అంటే బ్రహ్మ విద్య కాదురా. ఒక చేతి కర్రతో ఒక పెద్ద గోళికాయను ఆ ప్రక్కనే ఉన్న గోతిలోకి నెట్టాలి. గోళీని సరిగ్గా గోతిలోకి తోసినవాడు గెలిచినట్టు, తొయ్యలేనివాడు ఓడినట్టు అన్నమాట. ఆ మాత్రందానికే వాళ్ళ నాన్న ఎక్కడినుంచో దిగి వచ్చాడనుకోకు" అన్నాడు ప్రభాకర్.

"ఓసింతేనా...నేనూ ఇలాంటిదేదో అనుకున్నాను. అందుకే ప్రకాష్‌గాడితో చెప్పేవచ్చాను. గోల్ఫ్ పెద్ద గొప్ప కాదు. మానాన్న పేకముక్కలతోటి పెద్ద మేడలు కట్టగలడు అని చెప్పాను" అన్నాడు బంటి.

"చూసావా బంటీ, నాన్నకి గోల్ఫ్ గురించీ తెలుసు, పేకమేడలు కట్టడమూ తెలుసు. ఇంకా చాలా, చాలా వచ్చు. నాన్న ఎంతో గ్రేటు తెలుసా" అంది వంటిట్లోంచి మిరపకాయ బజ్జీల ప్లేటుతో వచ్చిన పద్మ.

"నువ్వు క్రితం నెలలో మన టీవీ బల్లంత ఎత్తున పేకమేడ కట్టావు గుర్తుందా. భలే కట్టావు నాన్నా....నాకు కూడా నేర్పించవూ?" అన్నాడు బంటి.

"అలాగే సంక్రాంతి సెలవుల్లో నేర్పిస్తాలే. ఎప్పుడూ ఆటలే

కాదు పోయి చదువుకో'' అన్నాడు ప్రభాకర్.

''ఎన్నేళ్ళయిందిరా నిన్ను చూసి, బావున్నావా సోమూ'' అంటూ ఆప్యాయంగా కౌగలించుకున్నాడు ప్రభాకర్.

''ఇన్నేళ్ళయినా నేను ఊరిలోకి వచ్చానని తెలిసిన వెంటనే నన్ను చూడడానికి వచ్చావు చూడు. అదే చెప్తోంది, మనం ఒకప్పుడు ఎంత ప్రాణస్నేహితులమో, ఇప్పుడూ మన మధ్య అంతే అభిమానముందని'' అన్నాడు సోముప్రసాదు.

జ్ఞాపకాల టేపులు మనసు రికార్డర్లలో తిరుగుతోంటే నోటివెంట జాలువారే అనుభవాల ప్రవాహంలో ఎన్నో ఏళ్ళగతం కొన్ని గంటల్లోనే ఆవిష్కృతం అయ్యింది.

''ప్రభా...కాలేజీ రోజులలో చాలా హుషారుగా, జల్సాగా ఉండేవాడివి. ఇప్పుడూ అలాగే ఉన్నావా లేక పెళ్ళయ్యి, పిల్లాడు పుట్టాక చల్లబడ్డావా'' అన్నాడు సోము.

''లేదురా హుషారు సంగతి ఎప్పుడో మర్చిపోయాను. జీవితంలోంచి ప్రేమ పోయిందనిపిస్తుంది. పెళ్ళయిన కొత్తలో మా ఆవిడా నేనూ ఎంతో అన్యోన్యంగా ఉండేవాళ్ళం. మా ఆవిడ నన్ను తన వాలు జడ కన్నా ప్రాణంగా చూసుకునేది. నేను తనని కొత్త కరెన్సీ నోటు కన్నా పదిలంగా చూసుకునేవాడిని. అలా కాలం గడిచేకొద్దీ మూత తీసి వదిలేసిన సెంటు బాటిలు ఖాళీ అయిపోయినట్టు మా జీవితాల్లోంచి కూడా ఆ ప్రేమ మాయమయ్యింది. అది తప్పితే వేరే బాధేమీ లేదనుకో. జీవితం హాయిగానే గడిచిపోతోంది.'' అన్నాడు ప్రభాకర్.

''అదేంటిరా....అలా అంటావు. మనిషై పుట్టాక ప్రేమ లేనిదే బ్రతకలేడు. అందుకే జీవితంలో ప్రతీ దశకీ ఒక్కొక్క రకమైన ప్రేమ పొందే ఏర్పాటు చేసుకున్నాడు. చిన్నప్పుడు తల్లితండ్రులు, పెరుగుతున్నప్పుడు స్నేహితులు, వయసొచ్చాక భాగస్వామీ, వయసు మీరాక పిల్లలూ ఇలా. నీ కాలేజీ ప్రేమ కథలు చూసిన నాకు, ఇప్పుడు నువ్వు ఇలా మాట్లాడటం ఆశ్చర్యంగా ఉంది.'' అన్నాడు సోము.

''కాలేజీ ప్రేమకథ అంటే చిత్ర గుర్తుకొస్తుందిరా. ఆ అమ్మాయి వెంట ప్రేమ, ప్రేమ అంటూ ఎంత పడినా, కనీసం నామొహం కేసి చూసి ఒక్క నవ్వు కూడా నవ్వలేదురా. నా ప్రేమకు తను కూడా స్పందించి ఉంటే ఈ పాటికి మా ప్రేమ కూడా రోమియో జూలియట్, లైలా మజ్నూ అంత గొప్ప ప్రేమ అయ్యుండేది. సరే, ఎంతసేపూ నా సుత్తేనా... నీసంగతి చెప్పు. నీదీ నా కథేనా, లేక నీది వేరే కథా?'' అన్నాడు ప్రభాకర్.

''నేను చాలా అదృష్టవంతుడినిరోయ్. మా ఆవిడకి నేనే ప్రపంచం. నేను గొప్పవాడినంటుంది. టీవీ క్విజ్జులలో అడిగే ఒకట్రెండు ప్రశ్నలకి జవాబులు చెప్తే నేను ఐనుస్టీనుని అనుకుంటుంది. నేను లాల్చీ, పైజామా వేస్తే నన్ను మించిన అందగాడు లేడంటుంది. మొదట్లో ఇవన్నీ నమ్మేవాడిని కాదు. అమాయకత్వమో, వెటకారమో అనుకునేవాడిని. కాని మెల్లగా తెలుసుకున్నాను. ఆమె ప్రపంచం అంతా నేనే నిండి ఉన్నాను అని. నువ్వే చెప్పరా, మన ఇద్దరికీ గొప్ప చదువూ లేదు, పెద్ద అందం కూడా లేదు. పోనీ ఏదన్నా మంచి హోదా కాని, బోలెడు జీతం కాని ఉందా...లేదు. మనిద్దరమూ సాధారణ ఉద్యోగస్తులమేనాయే. అలాంటి నన్ను, అవన్నీ ఉన్న చాలామంది కన్నా గొప్పవాడిని అని తను మనసారా నమ్మి, నన్ను నమ్మేలా చేసి నా మనసు వాకిట్లోంచి ప్రశాంతత బయటకు పోకుండా కాపలా కాస్తోందిరా నా భార్య. ఇక మాకు పాప పుట్టినప్పటినుంచి మా ఆనందం రెట్టింపయ్యింది. మా పాప దృష్టిలో నేనో సూపరుమేనుని తెలుసా. ఇంకా.....''

''సోమూ...ఈమధ్య అద్దంలో మొహం చూసుకునే అలవాటు పోయిందిరా....నువ్వు ఇప్పుడు చెబుతోంటే గుర్తుకొచ్చింది నా అందం సంగతి. ఇందాక అన్నాను చూడు రోమియో జూలియట్, లైలా మజ్నూ ప్రేమ కథలు గొప్పవి అని. అది పొరపాటురా. వాటి కన్నా గొప్పవి ఎన్నో,ఎన్నో నిజమైన ప్రేమ కథలు మనలాంటి ఎందరో సామాన్యుల ఇళ్ళలో రోజూ జరుగుతూనే ఉంటాయి అని ఇప్పుడే తెలుసుకున్నాను. నేను ఇప్పుడు వెంటనే ఇంటికి వెళ్ళాలి. నిన్ను మళ్ళీ త్వరలో కలుస్తాను. ఆ లోపల విలువైన ఆభరణాలు, బట్టలూ కప్పినా వాటి విలువ ఏ మాత్రం తెలుసుకోలేని గంగిరెద్దు ఏదైనా ఎదురుపడితే నన్ను గుర్తు తెచ్చుకో'' అని చెప్పి హడావిడిగా బయల్దేరి వెళ్ళిపోయాడు ప్రభాకర్.